శరవేగంగా అభివృద్ధి పనులు

- సాక్షి కథనంతో కదిలిన పంచాయతీ పాలకవర్గం
- రూ.49.12 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులు
- సాక్షికి కృతజ్ఞతలు తెలియజేసిన పంచాయతీ ప్రజలు

వీరఘట్టం:

స్థానిక మేజర్ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.98 లక్షలు, జనరల్ ఫండ్ రూ.28 లక్షలతో కలిపి మొత్తం పంచాయతీ ఖాతాలో రూ.1.26 కోట్ల నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోకపోవడంతో వీరఘట్టంలో అభివృద్ధి పడకేసింది. ఈ వ్యవహారంపై మార్చి 31న సాక్షిలో 'వినియోగానికి నోచుకోని నిధులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీలో 28 పనులను రూ.49.12 లక్షలతో చేపట్టేందుకు తీర్మానం చేశారు. ఇందుకు అనుగుణంగా రెల్లివీధి నుంచి పొల్లకు రోడ్డు, కొత్త బస్టాండ్‌లో కల్వర్టు, ఎల్లంకివీధిలో మెట్ల నిర్మాణం, మందిరం వీధిలో రోడ్డు నిర్మాణం, మేకలవీధిలో రోడ్డు నిర్మాణం పనులను శరవేగంగా పూర్తి చేశారు. వీటితో పాటు కొత్త బస్టాండ్‌లో కల్వర్టు పనులు బుధవారం చేపట్టారు. వీటితో పాటు మిగిలిన సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలను కొద్ది రోజుల్లో పూర్తి చేస్తామని ఈఓ బి.కోటేశ్వరరావు తెలిపారు. పంచాయతీలో మూలుగుతున్న నిధుల విషయాన్ని ప్రజలకు తెలియజేసి, పంచాయతీ పాలకవర్గం స్పందించేలా చేసి అభివృద్ధి పనులు జరిగేలా చూసిన సాక్షికి మేజర్ పంచాయతీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.


కొత్త బస్టాండ్‌లో ప్రారంభించిన కల్వర్టు పనులు


సాక్షి
వినియోగానికి నోచుకోని నిధులు

మార్చి 31న సాక్షిలో ప్రచురితమైన కథనం


ఎల్లంకి వీధికి వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన మెట్ల ర్యాంపు

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

- ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే కళావతి


వీరఘట్టం: సింహాచలం చందనోత్సవంలో జరిగిన ఘోర విషాదం తనను ఎంతగానో కలచివేసిందని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ దుర్ఘటనపై వండువలోని తన స్వగృహంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విషాదంలో ఎనిమిది మంది మృతి చెందడం బాధాకరమన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా...?

పాలకొండ రూరల్: దైవ దర్శనాలకు వచ్చే అమాయక భక్తుల ప్రాణాలు పోతుంటే ఇంత నిర్లక్ష్యంగా ఎలా వ్యవహరిస్తారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రశ్నించారు. చందనోత్సవంలో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు గోడ కూలి మృతి చెందడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గతంలో తిరుమల దేవస్థానంలో ఇటువంటి సంఘటన జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా కూటమి ప్రభుత్వంలో చలనం లేకపోవటం విడ్డూరమన్నారు. పదే పదే ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుని భక్తులు చనిపోతుంటే కంటితుడుపు చర్యలు తీసుకోవడం పట్ల ఆమె మండిపడ్డారు. మండలంలోని లుంబూరు గ్రామానికి బుధవారం వచ్చిన కళావతి విలేకరులతో మాట్లాడుతూ.. తాజా ఘటనలో ఏడుగురు మరణించడంతో పాటు మరో 10 మంది గాయపడడం, వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండడం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. వేలాదిగా భక్తులు వచ్చే చోట తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. ఇటీవలే కట్టిన గోడ కూలిపోయిందంటే నిర్మాణాలు ఎలా చేపట్టారో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈమె వెంట సర్పంచ్‌ల సంగ మండల ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్, నాయకులు రౌతు వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

అకాల వర్షంతో పంటలకు నష్టం


జియ్యమ్మవలస రూరల్: ఈదురు గాలికి విరిగిన అరటి మొక్కలు

గరుగుబిల్లి: వేసవి నువ్వు పంటకు అకాల వర్షం కురవడంతో చేతికందిన పంట కుళ్లిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం కోసిన నువ్వు పంట ఎండబెట్టే సమయంలో వర్షాలు కురవడంతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణం అనుకూలిస్తే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం నువ్వు పంటతో వస్తుంది. అయితే వర్షాలు విస్తారంగా కురవడంతో చేతికందిన పంట నీటి పాలవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని గరుగుబిల్లి, ఉద్దవోలు, బీవీపురం, పెద్దూరు తదితర గ్రామాల్లో వర్షాలు కారణంగా నువ్వు పంటకు నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు.

అకాల వర్షాలతో..

జియ్యమ్మవలస రూరల్: గత మూడు రోజులుగా మండలంలోని అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాల వలన అరటి, మొక్కజొన్న, నువ్వులు, వరి పంటలు చేతికొచ్చే సమయంలో ఇలా అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని సోమవారం 20.6, మంగళవారం 8.2 బుధవారం 12.2 మిల్లీమీటర్లగా వర్షపాతం నమోదు కావడంతో ముఖ్యంగా నువ్వులు, వరి పంటలు తడిసి ముద్దవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


గరుగుబిల్లి: వర్షానికి దెబ్బతిన్న నువ్వు పంట

● ఆకట్టుకున్న ధింసా నృత్యం


ధింసా నృత్యం చేస్తున్న చిన్నారులు

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దులోని మిర్చిగూడలో గల అక్షర బ్రహ్మ ఆలయంలో బుధవారం అక్షర తృతీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా అక్షర బ్రహ్మ కో ఆర్డినేటర్ సవర కరువయ్య ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన ధింసా నృత్యం ఆకట్టుకుంది.

తోటపల్లిలో అక్షరాభ్యాసాలు


గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల నిర్మించిన సరస్వతీదేవి ఆలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తోటపల్లి దేవస్థానంలో సరస్వతీదేవి ఆలయాన్ని నిర్మించడంతో అక్షరాభ్యాసం చేసే చిన్నారులకు ఎంతో ఉపయోగపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

కళలకు ఊపిరి పోయాలి

జియ్యమ్మవలస రూరల్: ఒకనాటి ప్రాచుర్యం పొందిన రంగస్థల, పౌరాణిక కళలు నేడు అంతరించిపోతున్నాయన్న ఆందోళనతో తిరిగి కళలకు ఊపిరి పోయాలన్న సంకల్పాన్ని కలిగి సంబంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పుట్టపర్తి జిల్లాకు చెందిన తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్.అంజనప్ప పార్వతీపురం మన్యం జిల్లాలోని సీనియర్ సిటిజన్ కళాకారులకు కళాభిషేకం ప్రశంసా పత్రాలను అందించారు. బుధవారం తురకనాయుడు వలస గ్రామంలో జిల్లాలో గల కళాకారుల పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళా రంగంలో పౌరాణిక, రంగస్థల జానపద కళల ద్వారా మనిషి జీవన విధానాలను ప్రభావితం చేసే విధంగా ప్రదర్శనలు ఉండేవని నేడు ఆ కళలు కనుమరుగైపోతున్న సమయంలో ప్రభుత్వాలు, ప్రజలు వాటిని పునఃప్రాణం పోసి నిలపాలని అన్నారు. రంగస్థలం కళాకారులు గుండ్రెడ్డి బలరామస్వామి, రౌంపల్లి స్వామి నాయుడు మాస్టారు, సింహాచలం మాస్టారు, బి.అప్పలనాయుడుతో పాటు 50 మంది కళాకారులను ఎంపిక చేసి కళాభిషేకం ప్రశంసా పత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం మూడు రోజులపాటు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విజయవాడ రీజనల్ ఆఫీస్ హడ్కో ప్రాంతీయ కార్యాలయం ప్రధాన అధికారి బీఎస్‌పి మూర్తి సుమారు రూ.లక్షా 50 వేల విలువైన ఫర్నిచర్‌ను అందించినట్లు డిప్యూటీ డీఈఓ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వాటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 50 కుర్చీలు, టేబుల్స్, ట్యూబ్ లైట్లు తదితర సామగ్రిని హడ్కో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందించినట్లు చెబుతూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు దత్తి అప్పలనాయుడు, సత్యనారాయణ మాస్టారు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఫర్నిచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఈఓ రాజ్‌కుమార్

నీతి, నిజాయితీతో జీవించాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రతీ ఒక్కరూ నీతి, సమాధానం కలిగి పరిశుద్ధాత్మతో జీవించాలని అంతర్జాతీయ మరియు టీవీ వర్తమానికులు పాస్టర్ సత్య సువార్త రాజు అన్నారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని యేసుక్రీస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ పి.షాలేమురాజు, సంఘ విశ్వాసుల ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి నిర్వహించిన ఆత్మ సంపదన మహా పండుగలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థన కూటముల్లో పాల్గొన్న సత్య సువార్త రాజు ప్రసంగిస్తూ..యేసుక్రీస్తు అందించిన బోధనల ప్రకారం ప్రతీ ఒక్కరూ నీతి, సమాధానం కలిగి పరిశుద్ధాత్మతో జీవించాలన్నారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై శిక్షణ

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. మండలంలోని తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి నేతృత్వంలో సామాజిక రుగ్మతులపై అవగాహన కల్పించే ప్రత్యేక చిత్రాలను ప్రదర్శించారు.

క్లుప్తంగా

మేడే కార్మికులకు సెలవు ప్రకటించాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ కార్మికుల దినోత్సవంగా జరుపుకునే మేడే రోజున కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలని ఉప కార్మిక కమిషనర్ ఎస్.డి.వి ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మేడే రోజున యజమానులు కార్మికులకు సెలవు ప్రకటించకుండా పని చేయించుకుంటే 30 రోజులలోపు ఏదో ఒక రోజు సెలవు ఇచ్చి, ఆ రోజుకు రెట్టింపు వేతనం ఇవ్వవలసిందేనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పరామర్శ

భామిని: మండలంలోని బత్తిలికి చెందిన టింగ చిన్న పిల్లమ్మ (78) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు, హిరమండలం ఎంపీటీసీ సభ్యుడు చింతాడ గిరి బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు అన్నాజీరావు ఎంపీటీసీ సభ్యుడిగా, కోడలు శాంతికుమారి సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. పరామర్శలో కోండ్రు జగదీష్, శ్రీనివాస, భోగాపురపు రవి నాయుడు, సిర్ల అశోక్, టింగ ప్రభాకర్, తదితరులున్నారు.

జీడి రైతులను ఆదుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: జీడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆశించిన స్థాయిలో జీడి పంట దిగుబడి రాకపోవడం, వచ్చిన కొద్దిపాటి పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడం, జీడి రైతులకు మేలు చేసే ఆలోచన, నిర్ణయాలను ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు చేయకపోవడం వంటి కారణాలతో జీడి రైతులు ఈ సీజన్లో నష్టపోయారన్నారు. జీడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా పైడితల్లి ఆలయ వార్షికోత్సవం


పైడితల్లి నిజరూపం

వీరఘట్టం: మండల కేంద్రంలోని పైడితల్లి ఆలయ వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్ కృచ్ఛ్రత్రయం, పంచగవ్య ఆరాధన, అఖండ దీపారాధన, రుత్విక్ వరుణ ప్రదానం, యాగశాల ప్రవేశ ద్వారపూజ, ధ్వజ పతాకావిష్కరణ, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు అమ్మవారు నిజరూపంలో దర్శనమిచ్చారు. దీంతో భక్తులు అమ్మ దర్శనానికి పోటెత్తారు. కార్యక్రమంలో భక్తులు, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: ఈకేవైసీ చేయించుకోని 0 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు ఈకేవైసీని చేయించాలని తహసీల్దార్ ఎస్.శేఖర్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు మరియు అంగన్‌వాడీ కార్యకర్తలతో బుధవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 277 మంది పిల్లలకు ఈకేవైసీ చేయాల్సి ఉందని, బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడం ఆధార్ కార్డులో డేట్ ఆఫ్ బర్త్ నమోదుల్లో జరిగిన తప్పిదాల కారణంగా ఈకేవైసీలు పూర్తి కాలేదని తెలిపారు. సచివాలయాల వద్ద దరఖాస్తు చేయించి, త్వరగా పొందేలా ప్రోత్సహించి ఈకేవైసీలను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్. సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో గల భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్(పీటీజీ) (గుమ్మలక్ష్మీపురం మండలం)లో 2025–26 విద్యా సంవత్సరానికిగానూ 3వ తరగతిలో ప్రవేశాలతో పాటు 4వ తరగతిలో ఖాళీ సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే 25వ తేదీలోగా భద్రగిరిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు(పీటీజీ)కు దరఖాస్తులు అందజేయాలన్నారు. 3వ తరగతిలో 80 సీట్లు, 4వ తరగతిలో 5 సీట్లు మాత్రమే భర్తీ చేయనున్నట్లు చెప్పారు. 3వ తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 2వ తరగతి చదివి ఉండాలని, 4వ తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు 3వ తరగతి చదివి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9347278537, 9490957218 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అభ్యుదయ కవితలకు శ్రీశ్రీ దిక్సూచీ..

పాలకొండ రూరల్: అభ్యుదయ కవితలకు ప్రముఖ కవి శ్రీశ్రీ దిక్సూచీ లాంటివారని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సంస్కృతోపాధ్యాయుడు బౌరోతు శంకరరావు అన్నారు. హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అధ్యక్షతన శ్రీశ్రీ జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కవితలు, వాటిలో ఉండే సామాజిక చైతన్యంపై విద్యార్థులకు వివరించారు. శ్రీశ్రీ కలం నుంచి ఉద్భవించిన మహాప్రస్థానం, తదితర రచనల విశిష్టతపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


శ్రీశ్రీ రచనల విశిష్టతను వివరిస్తున్న శంకరరావు

విత్తన బంతులు తయారు చేసుకోవాలి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు విత్తన బంతులను తయారు చేసుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని నందివానివలస, తోటపల్లి గ్రామాల్లో తయారు చేసిన విత్తన బంతులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులను సహజ ఎరువులను వినియోగించి పండించే పంటల వలన ఆరోగ్యం ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరించి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. పలు రకాల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, ఒండ్రు మట్టి, ఘన జీవామృతం పొడి, కట్టెల బూడిదను పొరలు పొరలుగా పట్టించడం వలన విత్తనం గుండ్రని బంతి వలే ఏర్పడుతుందన్నారు. విత్తన బంతుల తయారీపై రైతులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, సిబ్బంది డి.వెంకటనాయుడు, జి.లత, రైతులు ఎ.రమేష్, గంగునాయుడు, ఉమ తదితరులు పాల్గొన్నారు.


విత్తన బంతులపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం

మే 20న దేశవ్యాప్త సమ్మె

భామిని: బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మెకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు రోజుకు 8 గంటలు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గొర్లె జగన్నాయకులు, కొప్పర మిన్నారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు, కార్మికులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి..

సీతంపేట: పదో తరగతి ఫెయిలయిన విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాగా చదువుకుని ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ ప్రసన్నకుమార్, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఓ చిన్నబాబు

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 7వ తరగతి, 9వ తరగతలో మిగిలిన సీట్లు భర్తీ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో 3 సీట్లు బాలురకు, 9వ తరగతిలో 2 సీట్లు బాలురుకు ఖాళీ ఉన్నాయన్నారు. ఎస్టీ కులానికి చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులని, గుర్తింపు పొందిన పాఠశాలలో సంబంధిత తరగతికి ముందు తరగతిని పూర్తి చేసిన వారై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే 10వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో పాఠశాల కార్యాలయానికి నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మే 11వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

రసాయనాలు వినియోగిస్తే చర్యలు

పాలకొండ:

వ్యాపారులు రసాయనాలతో పండ్లను మగ్గిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార తనిఖీ అధికారి వై.రమేష్ స్పష్టం చేశారు. పట్టణంలోని పలు దుకాణాల వద్ద గల పండ్ల దుకాణదారులకు రసాయనాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి, అరటిపండ్లలో ఎక్కువగా రసాయన మందులు వినియోగిస్తున్నారని.. దీని ప్రభావం వినియోగదారుల ఆరోగ్యంపై పడుతుందని చెప్పారు. ఆయనతో పాటు ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి, మార్కెటింగ్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ ఉన్నారు.


దుకాణం వద్ద పండ్లను పరిశీలిస్తున్న అధికారులు

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాగునీటి బావులు, రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులు, బోరింగుల్లో క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. అలాగే దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.